కథానిక:

# దేశంకోసం

= శ్రీ రా. సి. అంజనేయశాస్త్రి =

"అమ్మా! ..."

"... "

"అమ్మా!... ఎలా వుంది?...చూడు..."

"...ఊఁ!...ఊఁ!!..."

వా వా
"కళ్లు తెరవలేవూ?...నేను విశ్వాన్ని..."

అమ్మ మొహంలో సంతోష రేఖ తళుక్కుమంది. అతికష్టంగా కనురెప్పలు విప్పుతూ "......వచ్చావా నాన్నా!..." అంది అస్పష్టంగా. విశ్వం యింకా దగ్గిరికి జరిగి "...కొంచెం తేలికగా వుందా అమ్మా!!" అని ప్రశ్నించాడు. మీద చెయ్యి వేద్దామని కుడిచెయ్యి ఎత్తబోయేసరికి అమ్మకి పంచప్రాణాలూ పట్టుకుని బిగతీసినట్టనిపించింది ఎముక విరగటం వల్ల. ఆ యమబాధ కొడుక్కి కనపడనీయకుండా వుండాలని ఎంత ప్రయత్నించినా, మూలుగుమాత్రం పైకి రాకుండా ఆపుకోగలిగింది తప్పితే కనుకొలకుల్లోంచి దాచలేకపోయింది. అనశంమాత్రం "ఆఁ!...కాస్త నయమే!...నాన్నా..." అంది.

"దాస్తున్నావా అమ్మా?...అమ్మమ్మో!... ఇదేమిటే యింత వాచిందీ చెయ్యి?..." అంటూ విశ్వం కట్టు విప్పుతుంటే, ఆయాసపడుతూ పరిగెత్తుకొచ్చిన రామం తప్పున కూలబడిపోయాడు. విశ్వం కంటే ముందుగానే అమ్మ "...ఏం నాన్నా? అంత హడావిడిగా వచ్చావు, ఏం జరిగిందీ?..." అని ప్రశ్నించింది. కుడిచెయ్యి బాధపడుతూ సీవుం కివుంటుంది. రామం సార్థకంగా విశ్వం కళ్లల్లోకి చూశాడు. అమ్మ ఆదుర్దాగా "...చెప్పు నాన్నా...చెప్పు...ఫరవాలేదు...నాకు తేలిగ్గానే వుంది...భయపడకు..." అని తొందరచేస్తుంటే రామం చెప్పక తప్పలేదు

"పోలీసుఘాటు ముట్టడి వేసింది. ఇళ్లల్లో జొరబడటమే కాదు...లాఠీలతో బాదటమే కాదు...అదృష్టవశాత్తు నేను ఊరుబైటి చెరువుగట్టున వుండటంచేత యిలా పరిగెత్తుకొచ్చి మీకు చెప్పగలుగుతున్నా..." అన్నాడు.

అమ్మకి ఆవేశం ఎక్కువైంది. "ఇళ్లల్లో జొరబడుతున్నారూ?...మనుష్యులు లేరా అక్కడ?... వెడదాం పదండి" అంటూ లేవబోతుంటే, విశ్వం పట్టుకొని ఆపాడు. మోకాటిచిప్పకూడా చితక కొట్టారయ్యో! పాపం ఎలా లేస్తుంది?!

"జనం ఎలా వున్నారు?" అని అడిగాడు విశ్వం.

"మాంచి ఉద్రేకంగా వున్నారు. బహుశః యీపాటికి కాల్పులదాకా కూడా వచ్చిందేమో!" అని రామం అంటూండగానే తుపాకి పేలుడు వినిపించింది.

"అమ్మో, మొదలెట్టారు...ఇహ మీరు రాకపోతే సర్వనాశనమే! స్మశానం చేసి వదల్తారు పోలీసులు" అని అరిచాడు రామం.

"చివరిక్షణాలుకూడా అమ్మదగ్గిర వుండలేకపోతున్నానే!..." అన్నాడు విశ్వం గంభీరంగా.

తుపాకిశబ్దం వినగానే కలిగిన ఉద్వేగంలో స్పృహతప్పినట్లు పడివున్న అమ్మ కాస్త సేదదీరగానే "...ఇంకా యిక్కడే వున్నార్రా?...ఈ ముసలిముండకోసం?...నేను చావనులే...చచ్చినా ఫరవాలేదులే...పొండి...నాపిల్లలు...నాదేశం...... అవిగో తుపాకిగుండ్లు...వాళ్లు లొంగిపోతారేమో?... వెళ్లండి...నాన్నా...వెళ్లండి..."

కాసిని నీళ్లు మాత్రం నోటిదగ్గిరిగా పెట్టి, అమ్మ కాళ్లని కళ్లకద్దుకుని వెళ్లిపోయారు విశ్వం, రామమూను ఆసుపత్రిఆవరణ దాటి.

## ౨

నిశాపిశాచపు నక్రదంతమల్లే వున్న ఆ కాలిదోవన వాళ్లిద్దరూ గ్రామం సమీపించారు పరిగెత్తినట్లు నడిచి. రాత్రి కార్చిన కన్నీటిచుక్కలల్లే నేలంతా నెత్తురుచుక్కలు కనిపిస్తున్నాయి. మృత్యువునిట్టూర్పల్లే రెల్లుగుబ్బులోంచి వచ్చిన గాలి నెత్తురులోని తడిని తాగేస్తోంది. ఆ దుబ్బులోంచే వస్తున్న మూలుగు ధ్వని, నరరక్తసిక్తమైన సైకతంలో పోలీసుబూట్ల నాదాల ముద్రలు మాసి అమాంతం ఆగిపోయింది ధీరత్వంతో. ఆదుర్దాగా విశ్వం దుబ్బులోకి తొంగిమాసే సరికి ఆకాశంలోంచి కిందపడ్డ నక్షత్రంలాగా మంగళసూత్రం మెరుస్తోంది.

"కల్యాణీ!" అని అప్రయత్నంగానే విశ్వం నోట్లోంచి వెలువడింది. గాఢంగా కావిలించుకున్న కనుగప్పుల్ని చీల్చుకుంటూ మిలమిలలాడే రెండుకళ్లు ఆ పరిచితధ్వని వచ్చినవేపుని వెతుకుతున్నాయి... విశ్వం ఆమెని బైటికి తీసి యిసుకమీద పడుకోబెట్టి నిర్ఘాంతపోయాడు. కన్నీ రాపుకోటం అశక్యమైంది. కల్యాణిపమిట చెంగంతా ఆమెరక్తంతోటే తడిసి పోయింది. ఒక తుపాకిగుండు దూసుకుపోయింది కుడి రొమ్ములోంచి. ఉత్తరీయం చించి కట్టుకట్టారు. కాని ఏం లాభం? ఆ సమయంలో భర్తని చూడగలిగినందుకు ఆశ్చర్యాన్నీ, భర్తసాన్నిధ్యంలో తనువు చాలిస్తున్నందుకు తృప్తినీ కనపరుస్తూ రెండుచేతులూ ఎత్తబోయి వాల్చేసింది. బలిదానదీప్తిని తమలోనే యిముడ్చుకుంటూ నేత్రాలెండూ మూసుకున్నాయి......

శవాన్ని బుజానేసుకు వస్తున్న విశ్వాన్నీ, అతని వెనకాలే లక్ష్మణుడల్లే నడుస్తున్న రామాన్నీ చూసి ఊళ్లో స్త్రీలంతా గొల్లున ఏడ్చారు. ఏడుస్తూనే జరిగిందంతా చెప్పారు. వచ్చిరావటంతోటే పోలీసులు ఇళ్ళల్లో జొరబడి "ఏడీ విశ్వం?... ఎక్కడ రామం? ... కల్యాణి ఎవరు?..." అంటూ, నానాదుర్భాషలూ ఆడటం మొదలెట్టారు. చేతికందినవారిని లాఠీలతో మోదసాగారు. మీ సంగతి మాకు తెలీదుకనక తెలీదని చెప్పాము! 'నేనే కల్యాణిని' అంటూ యీమె ముందుకొచ్చింది. ఆమెమీద చెయ్యి వెయ్యబోయేసరికి జనం ఉద్రిక్తమైంది. పోలీసుల చేతుల్లోంచి లాఠీలు లాక్కున్నారు. వాళ్లు కాస్త జంకేసరికి ఊరుబైటికి తరిమారు పోలీసుల్ని కల్యాణి ఎంత చెప్పినా వినకుండా. ఇంతలోకే తుపాకులతోసహా రెండోలారీ వచ్చింది. ఏదో జయించామనే ధీమాలో ఉన్న జనంమీద గుండ్లవర్షం కురిపించారు...కల్యాణిని లారీలో ఎక్కించుకుపోవటం చూశాం...కాని దారిలో లారీలో ఏం జరిగిందో ఏమో!!"

ఇంతసేపూ కొయ్యబొమ్మల్లే నిలబడివున్న విశ్వానికి మతిచలిస్తుందో, గుండె ఆగిపోతుందో అని భయపడుతున్నాడు రామం. క్షణకాలం నిస్తబ్ధత భయపెట్టింది. మందహాసం చేస్తూ "కల్యాణి పోయినదారి కనిపిస్తోందికదూ?" అన్నాడు విశ్వం. అవునన్నట్టుగా అంతా నిశ్శబ్దంగా నుంచున్నారు.

"కల్యాణి వద్దంటున్నా పోలీసుల్ని తరిమికొట్టారు మీరు...!" అని ఆవేదనపడ్డాడు విశ్వం.

"ఆ తల్లిమీద ఆరాక్షసి చెయ్యివెయ్యబోయేసరికి మానెత్తుర్లు పొంగాయి" అన్నాడు ఓ శతవృద్ధు.

"అందుకనే కాల్చటానికి సందు చిక్కింది." అని నచ్చచెప్పబోయాడు విశ్వం.

"వారంరోజుల క్రితం పూరుకుంటేనేగదాండి, మీ అమ్మగార్ని నలగపొడిచేశారయ్యా!..." అని ఒక యువకుడు ఉత్తేజంతో అడిగాడు.

"అయినా అప్పుడిన్ని ప్రాణాలు పోయాయా తమ్ముడూ?" అంటూంటే విశ్వంకళ్ళల్లోంచి రెండు అశ్రుకణాలు రాలాయి.

## 3

రుధిరప్లావితమైన అరుణాంబరాన్ని ప్రాక్పేటికలోంచి తీస్తోంది ఉషాకన్య. ఇంతలోకే అమ్మమరణ

వార్తని మోసుకొచ్చింది ఆసుపత్రినర్సు. ఆ దుఃఖాన్ని మింగటానికి రాత్రినుంచే సిద్ధపడుతున్న విశ్వం ఆస్థైర్యత పొందలేదు. ఎంత చెప్పినా వినకుండా కల్యాణి శవాన్ని ఊరేగించితీరాలని పట్టుపట్టారు గ్రామస్థులు. పోలీసు లెంత రెచ్చగొట్టినా దౌర్జన్యానికి దిగకుండా వుంటే ఊరేగింపుకు ఒప్పుకుంటా నన్నాడు ఆఖరికి విశ్వం. అమ్మమరణవార్త కొత్తచిక్కుని తెచ్చిపెట్టింది. నిర్బంధంలో వుండగా మరణించడంవల్ల, అమ్మశవాన్ని అప్పజెప్పటానికి అధికార్లు అంగీకరించలేదు. మళ్లా ఘర్షణ బైల్దేరేటట్టు కనిపిస్తోంది. పట్నం జనంకూడా ఆస్పత్రిచుట్టూ యిసకవేస్తే రాలకుండా మూగారు. టెలిఫోనుమీద ఏం మంతనాలు జరిగాయో ఏమో, బారెడు పొద్దెక్కేసరికి, అమ్మశవాన్ని ప్రజలకప్పగించారు అధికార్లు. బ్రహ్మాండమైన ఆ ఊరేగింపులో శాంతిభద్రతల్ని కాపాడటానికి రక్షకభటులు సిద్ధమయ్యారు. అమ్మనీ, కల్యాణినీ అతిదారుణంగా హత్యచేసిన ఆ పోలీసులే మళ్లా ప్రత్యక్షమయేసరికి ప్రజల ఆవేశాలు ఆకాశాన్నంటాయి. "శాంతికి భంగం కలగరాదని నిజంగా కోరేటట్లయితే, పోలీసుల్ని వెళ్ళిపొమ్మనండి"అని విశ్వం అధికారులకి చెప్పాడు స్వయంగా వెళ్లి. అంతకుపూర్వమే వారంట్లు జారీ చెయ్యబడినాకూడా, ఆ సమయంలో విశ్వాన్ని అరెస్టు చేసే సాహసం లేకపోయింది వాళ్లకు. విధిలేక పోలీసుల్ని తొలగించారు ఊరేగింపులోంచి...దారిపొడుగునా ఆ అమరజీవులమీద పూలవర్షం, అశ్రువర్షం కురిపించారు ప్రజలు. రెండు శవాల మధ్యా నడుస్తున్న విశ్వం మొహం ఉద్రిక్తపడుతున్న జనసమూహాన్ని శాంతింపజేస్తోంది. స్వర్గధామంచేరుకుంటున్న అత్తాకోడళ్ల ఆత్మలు ఏమిటో మాట్లాడుకుంటున్నాయి దార్లో గుర్తులు పెడుతూను......

స్మశానంలో విశ్వం అందరిచేతా "దేశంకోసం సర్వస్వం అర్పిస్తాం"అని ప్రమాణంచేయించాడు. జనమంతా ఎవరిళ్లకి వాళ్లు వెళ్ళింతర్వాత, విశ్వాన్ని అరెస్టు చెయ్యటానికి రెండులారీల్లో సాయుధులైన పోలీసులూ, అధికార్లూ ఒచ్చారు. కాళ్లకీ చేతులకీ సంకెళ్లు వేసి విశ్వాన్ని తీసుకుపోతుంటే ప్రజలు నిర్ఘాంతపోయారు. ఇంతకీముందేగా, శాంతిభద్రతల్ని కాపాడటానికిగాను విశ్వాన్ని ఊరేగింపులో ఉండనిచ్చింది! రామంమాత్రం అందలేదు. అప్పటికప్పుడే ప్రత్యేక రైలులో విశ్వాన్ని ఎక్కడికో తీసుకుపోయారు.

తరవాత రెండునెలలకి తెలిసింది, పోలీసులకి అందకుండా తప్పించుకుపోతుంటే, రామాన్ని కాల్చిచంపారని !!

